
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 10 జూలై 2024

ఘనంగా శీత్లా భవానీ వేడుకలు 8

దేశానికి రక్షణ కవచం ప్రధాని మోదీ 7

మొలకెత్తిన ఆశలు

- పత్తి రైతుల్లో ఆనందం
- లక్ష్యం 49,215 ఎకరాలు
- 40568 ఎకరాల్లో విత్తనాలు
- జిల్లాలో 218.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- జూలై చివరి వరకు పత్తి సాగుకు అవకాశం
- మందకొడిగా వరినాట్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పత్తిసాగును తెల్లబంగారంగా భావించే రైతుల్లో మళ్లీ ఆశలు మొల కెత్తాయి. జిల్లాలో వరిసాగుతో పాటు పత్తిసాగుకు ప్రాధాన్యం ఇచ్చే అన్నదాతలకు జూన్‌లోనే విత్తనాలు వేసుకున్నారు. వానలు ముఖం చాటే యడంతో నిరాశకుగురయ్యారు. పత్తి విత్తనాలు మొలకెత్తక కొంత మంది రైతులు నష్టపోయారు. జూలై మొదటి వారం నుంచి వరుసగా వర్షపు జల్లులు కురుస్తుండడంతో పత్తికి జీవం వచ్చింది. జిల్లాలో వేసుకున్న విత్తనాలు మొలకెత్తి పెరుగుతుండడంతో రైతులు ఆశాజనకంగా ఉన్నారు. జూలై చివరి వరకు విత్తనాలు వేసుకునే అవకాశం ఉందని వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వర్షాభావ పరిస్థితుల మధ్య మొలకెత్తని విత్తనాల స్థానంలో మళ్లీ నాటుకుంటున్నారు. మరోవైపు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పత్తికి అనుకూలంగా ఉన్నాయి. వరినాట్లు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి.

• జిల్లాలో 40,568 ఎకరాల్లో పత్తి

జిల్లాలో వానాకాలం సాగు 2.42 లక్షల ఎకరాల్లో ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. అందులో ప్రధానంగా వరి 1.83 లక్షల ఎకరాలు, పత్తి 49,215 ఎకరాల్లో వేస్తారనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తు తం జిల్లాలో వానాకాలం సీజన్‌లో 46,835 ఎకరాల్లో వివిధ పం టలు సాగు చేశారు. వరినాట్లు 4810 ఎకరాల్లో మాత్రమే పడ్డాయి. పత్తి 40 వేల 568 ఎకరాల్లో సాగు చేశారు. వీటితో పాటు మొక్కజొన్న 813 ఎకరాలు, కందులు 588 ఎకరాలు, పెసర 38 ఎకరాల్లో వేశారు.

• 218 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురవడం లేదు. 188.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షాపాతానికి 218.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అన్ని మండలాల్లో సమృద్ధిగా వర్షాలు కురవకపోవడం వరినాట్లపై ప్రభావం చూపుతోంది. సాధారణ వర్షపాతం కంటే గంభీరావుపేటలో 38 శాతం లోటు ఉంది. రుద్రంగి, వేములవాడ రూరల్, బోయినపల్లి, కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేటలో సాధారణ వర్షపాతమే నమోదైంది. ముస్తా బాద్, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, వేములవాడ, సిరిసిల్లలో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా నమోదైంది. గత సంవత్సరం జూలైలో భారీ వర్షాలు కురిశాయి. ఈ సారి వర్షాలు నామామాత్రంగానే ఉన్నాయి.



ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటలో పెరిగిన పత్తి





వీర్నపల్లిలో పత్తి సాగు

రాజన్న ఖజానాకు రూ.కోటి 88 లక్షల నగదు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, జూలై 9 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఖజానాకు రూ.కోటి 88 లక్షల 69 వేల 697 లభించినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. రాజన్న ఆలయంలోని 38 రోజుల హుండీలను ఆలయ ఓపెన్ స్లాబ్‌లో రెండు రోజులపాటు లెక్కించనున్నారు. మొదటి రోజు మంగళవారం అత్యంత భద్రత మధ్య హుండీలను లెక్కించారు. రూ.కోటి 88 లక్షల 69 వేల 697 నగదు, 360 గ్రాముల 100 మిల్లీ గ్రాముల బంగారం, 14 కిలోల 150 గ్రాముల వెండి సమకూరినట్లు తెలిపారు. హుండీ లెక్కింపును ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏఈవోలు హరికిషన్, ప్రతాప నవీన్ సూపరింటెండెంట్‌లు, ఏసీ కార్యాలయం పరిశీలకులు సత్యనారాయణతో పాటు లలిత సేవ సమితి వారితో స్వచ్ఛంద సేవకులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. బుధవారం ఉదయం హుండీ లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా బద్దిపోచమ్మ బోనాలు



బద్ది పోచమ్మ బోనాల్లో భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 9: వేములవాడ పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణులు బద్దిపోచమ్మ అమ్మవారికి మంగళవారం బోనాలు నిర్వహించారు. మట్టికుండల్లో అమ్మవారికి నైవేద్యాన్ని వండి సంప్రదాయ దుస్తుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, నాయకులు సాగరం వెంకటస్వామి, కనికరపు రాకేష్, నాయీబ్రాహ్మణులు చిరంజీవి, భూమేష్, రమేష్ ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీని కలిసిన నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 9 : జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సోమవారం బాధ్యతలను స్వీకరించిన స్వప్నను మంగళవారం పలువురు నాయకులు సన్మానించారు. కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఈడీ స్వప్నను జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎస్సీఎస్టీ అట్రాసిటీ మాజీ సభ్యుడు బండ నాంపెల్లి, ప్రజా సమీకృత సేవ కమిటీ అధ్యక్షుడు రవివర్మ, సుదర్శన్, బండ నరేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు.

బోడకాకర కిలో రూ.400



మార్కెట్‌లో బోడకాకర కాయలు

సిరిసిల్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో మార్కెట్‌కు వచ్చే బోడకాకర నోరూరిస్తున్నా ధర మాత్రం దడ పుట్టిస్తోంది. మంగళవారం సిరిసిల్ల మార్కెట్‌లోకి వచ్చిన బోడ కాకర కిలో రూ.400 ధర పలికింది. ఎన్నో ఔషద గుణాలున్నా బోడకాకర ధర ఎక్కువైనా పట్టణ వాసులు కొనుగోలు చేశారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన



పరిశీలిస్తున్న ఆర్డీవో

చందుర్తి, జూలై 9: చందుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ మంగళవారం పరిశీలించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చందుర్తి పర్యటనలో భాగంగా ఆర్డీవో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రాధాన్య కార్యాక్రమాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయించాలని, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వనమహోత్సవం, ప్రజా పాలన సహాయ కేంద్రాల నిర్వహణ, మహిళా శక్తి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, వానాకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం, ఉద్యోగుల సాధారణ బదిలీలు వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ వన మహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు అందుబాటులో ఉన్నాయని, వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో పల్లె ప్రకృతి వనాలు, అర్బన్ పార్కులలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని, గతంలో నాటిన మొక్కలలో చనిపోయిన మొక్కలను రిప్లేస్ చేయాలని అన్నారు. ఇంటింటికీ పంపిణీ చేసే మొక్కల పెంపకం, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదుక్కుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, మహిళా సంఘాలతో విద్యార్థుల యూనిఫాం కుట్టించినట్లు చెప్పారు. ప్రస్తుతం క్యాంటీన్లు, మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో నూతన మీ సేవా కేంద్రాల ఏర్పాటు చెయ్యాల్సిన అవసరం ఉందన్నారు. వీలైనంత మేర మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేయాలని, ఆసక్తి, అర్హత గల మహిళల గుర్తింపు, వారి శిక్షణ, రూ.2.50 లక్షల బ్యాంకు లింకేజ్ రుణం వంటి అంశాలను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రముఖమైన ప్రదేశాలలో మహిళా సంఘాలతో అమ్మ క్యాంటీన్‌లను ఏర్పాటు చేయించాలన్నారు. క్యాంటీన్‌లలో నాణ్యమైన పదార్థాలను వినియోగించాలని సూచించారు. మహిళా శక్తి కింద ఇతర వినూత్న కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రభుత్వానికి సలహాలు అందజేయాలన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ, మెప్మా ద్వారా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వీలైనంత మేర మహిళలను మహిళ సంఘాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన మేర నూతన మహిళా సంఘాల ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సంఘాల జిల్లా సమాఖ్య సమావేశం, మండల సమాఖ్య సమావేశాలు రెగ్యులర్‌గా నిర్వహించాలని ఆదేశించారు. స్వశక్తి మహిళా సంఘాలకు అందించే రుణ లక్ష్యాలను పూర్తి చేయాలని, ఆ రుణాలతో మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనుల చివరి దశ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ పూర్తి చేయాలన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంటల సాగు పెరుగుతుందని, రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని అన్నారు. విత్తనాల లభ్యత అంశాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించాలన్నారు. రైతు భరోసా వర్క్‌షాప్‌లో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా కేసుల వ్యాప్తి అరికట్టాలని, స్థానిక సంస్థల అధికారులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గ్రామాలు, పట్టణాలలో రెగ్యులర్‌గా ఫాగింగ్ చేయాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. పెండింగ్ ధరణి దరఖాస్తులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లా స్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వ ఉత్తర్వులు నిబంధనలు తప్పకుండా పాటించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈవో ఉమారాణి, డీఆర్డీవో శేషాద్రి, డీఈవో రమేష్ కుమార్, డీపీవో వీర బుచ్చయ్య, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్ రావు, డీఏవో భాస్కర్, డిప్యూటీ జడ్పీ సీఈవో గీత, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీ రాములు, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ నిధులు

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

చందుర్తి, జూలై 9: రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.30 లక్షల 50 వేలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు మంత్రికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, పంచాయతీ రాజ్ ఈఈ సూర్య ప్రకాష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రదీప్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నాయకులు మార్త సత్తయ్య, పొంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి, ఎర్రం మహే ష్, పెరుక గంగరాజు, గోపు బాలరాజు, బండ మల్లేశం,నాంద్యాపు వెంకటేష్, పడాల గణేష్, విజేందర్, గోపాల్ రెడ్డి, బొప్ప వెంకన్న, మర్రి మల్లేశం, శంకర్, శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న బండి సంజయ్ కుమార్



స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

చందుర్తి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మార్త సత్తయ్య మంగళవారం వినతిపత్రం అందజేశారు. చందుర్తి మండల కేంద్రంలో వేములవాడ-కోరుట్ల రహదారిలో సెంట్రల్ లైటింగ్, చందుర్తి నుంచి నర్సింగాపూర్, బండపల్లి నుంచి కిష్టంపేట, మూఢపల్లి హరిజనవాడ బైపాస్ నుంచి ఎనగల్ గ్రామాలకు లింకు రోడ్ల నిర్మాణానికి, మూడపల్లి గ్రామంలో హై లెవెల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న చందుర్తి మోత్కురావుపేట వరకు రెండు మండలాలను కలిపే రోడ్డు అటవీ శాఖ అనుమతులు లేనందున పూర్తి కాలేదని, అటవీశాఖ నుండి అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేయించాలని కోరారు. వినతి పత్రాలు అందజేసిన వారిలో బొప్ప వెంకన్న, యెముల శంకర్ ఉన్నారు.

దొంగతనానికి యత్నం

చందుర్తి మండల కేంద్రంలో మంగళవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యటనలో నాయకుడి జేబులో నుంచి డబ్బులు దొంగి లిస్తుండగా అప్రమత్తమైన నాయకుడు దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం వద్ద నాయకులు, కార్యకర్తలు ఒకేసారి గుంపుగా రావడంతో దొంగ చేతివాటానికి యత్నించాడు. పట్టుకుని అక్కడే ఉన్న పోలీసులకు అప్పగించారు. సదరు వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా మందమర్రికి చెందిన బొక్క అంజి అనే వ్యక్తిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ బైఠాయింపు

రామగిరి, జూలై 9: తనకు న్యాయం చేయాలని ఓ మహిళ మంగళ వారం రామగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించింది. రామగిరి మండలం బేగంపేట్ గ్రామానికి చెందిన దాసరి శివకుమార్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లొంగదీసుకొని మోసం చేశాడని అదే గ్రామానికి చెందిన ముత్యాల కొమలత మే 25న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పాటు తన వద్ద నుంచి డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. తాను ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నా పరారీలోనే ఉన్నాడని తెలిపింది. జూలై 8న గ్రామంలోని మెడికల్ షాప్‌నకు మందుల కోసం వెళ్తుండగా దాసరి శివ తమ్ముడు, చెల్లెలు కేసు విషయంలో రాజీపడాలని, లేదంటే తనను తన పిల్లలని చంపుతానని బెదిరింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేసింది. దాసరి శివ కుటుంబంతో తనకు ప్రాణభయం ఉందని, ఇప్పటికైనా పోలీసులు స్పందించాలని శివను అరెస్ట్ చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట రోదిస్తూ బైఠాయించింది. దీంతో మహిళ కానిస్టేబుల్‌లు వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళను స్టేషన్ ఆవరణలోకి తరలించారు. కాగా ముత్యాల కొమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు. బాధిత మహిళకు న్యాయం జరిగే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువకులపై కేసు నమోదు

రాయికల్, జూలై 9: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఇద్దరిపై మంగళవారం కేసు నమోదైంది. వడుకాపురం శ్రీవాత్సవ్‌కు అదే గ్రామానికి చెందిన మాణిక్యం గంగాధర్, పందిరి ప్రమోద్‌లు రాయికల్ పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేశారు. దీంతో శ్రీ వాత్సవ్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరువురు యువకులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

బాలికను లైంగికంగా వేధించిన కేసులో

మహిళకు జైలుశిక్ష

జగిత్యాల టౌన్, జూలై 9: బాలికను కిడ్నాప్ చేసి లైంగికంగా లోబర్చుకున్న ఓ మహిళకు ఒక కేసులో 5 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా, మరొక కేసులో మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..

కోరుట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికకు తన ఇంటి పక్కనే నివసిస్తున్న అస్మా అంజూ అనే మహిళతో పరిచయం ఏర్పడింది. బాలికకు సదరు మహిళ మాయమాటలు చెప్పి ఇంట్లో నుంచి బయటకు తీసుకెళ్లింది. అసభ్యకరమైన కార్యకలాపాలతో లైంగికంగా లోబరుచుకుంది. అప్పట్లో ఈ విషయం సంచలనంగా మారగా బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు నిందితురాలు అస్మా అంజూపై 2020-21 సంవత్సరంలో ఫోక్సోతో పాటు వివిధ సెక్షన్ల కింద రెండు కేసులు నమోదు చేశారు.

కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితురాలు అస్మా అంజూను కోర్టులో హాజరు పరుచగా అడిషనల్ పీపీ మల్లికార్జున్ కేసు వాదించారు. అప్పటి డీఎస్పీ రాజశేఖర్ రాజుతో పాటు ఎస్సైలు సతీష్, పృథ్వీధర్, రాజ ప్రమీల, రాజు నాయక్‌లతో పాటు కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్ కుమార్, రాజు, నీల నాయక్‌లు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును విచారించిన న్యాయమూర్తి నీలిమ నిందితు రాలు అస్మా అంజూకు జైలు శిక్షతో పాటు రూ. 15 వేల జరిమానా విధిస్తూ గత జూన్ 26న తీర్పు వెలువరించారు.

ఈ కేసుల్లో తప్ప కుండా శిక్ష పడుతుందని గమనించిన అస్మా అంజూ బెయిల్‌పై బయటి ఉండి విచారణకు రాకుండా శిక్ష పడిన జూన్ 26వ తేదీన కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న న్యాయమూర్తి నిందితురాలిపై వారెంట్ ఇష్యూ చేయగా మంగళవారం పోలీసులు నిందితురాలు అస్మా అంజూను పట్టుకుని జైలుకు తరలించారు. నిందితురాలికి జైలు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గంజాయి కేసులో మరో ఇద్దరు అరెస్టు

మెట్‌పల్లి, జూలై 9: గంజాయి తరలింపు కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న మండలంలోని మేడిపల్లి శివారులో ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించాడు.

అదే సమయంలో అనుమానాస్పదంగా కోరుట్ల పట్టణానికి చెందిన నలుగురు యువకులు గంజాయి తీసుకొని రెండు ద్విచక్ర వాహనాలపై అక్కడి వచ్చారు. పోలీసులను గమనించి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై పారిపోగా మరో ఇద్దరు మైనర్లు పట్టుబడ్డారు. అందులో తప్పించుకుని పారిపోయిన విజయ్, ఉదయ్ ఇద్దరి కోసం ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లు గాలిం పు ముమ్మరం చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం శివారులో అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకొని విచారించారు. నేరం ఒప్పుకొని మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహమ్మద్ అజార్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కోరుట్లకు తీసుకొస్తు న్నట్లు తెలిపారు. నాందేడ్‌లో గంజాయి అమ్ముతున్న మహమ్మద్ అజార్‌తో పాటు నలుగురుని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డి ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లతో పాటు సిబ్బందిని అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురుకి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 9: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్‌కోర్టు జడ్జి మంగళవారం జైలు శిక్ష, జరిమా నా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల తనిఖీల్లో పట్టుబడిన 23 మందిని కోర్టులో హాజరు పరచగా అందులో ఇద్దరు వ్యక్తులకు ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురికి మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం 11వేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మిగతా 18 మందికి 27 వేల రూపాయలు జరిమానా విధించి నట్లు పేర్కొన్నారు. ఇందులో ఒక మైనర్‌కు 2,500 రూపాయలు జరిమా నా విధించినట్లు తెలిపారు.

వైద్యుడిని దూషించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 9: వైద్యుడిని దూషించి, దాడి చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ శివారులోని చల్మెడ ఆసుపత్రిలో పీజీ చదువుతూ డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బానోతు రవి కుమార్ అనే వైద్యుడి విధులను ఆటంకపరచి దూషించి, దాడి చేసేందుకు యత్నించిన శ్యామ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఈనెల 7న సాయంత్రం శ్యామ్ అనే వ్యక్తి ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలోకి వచ్చి తనకు చికిత్స చేయాలంటూ అక్కడ విధుల్లో ఉన్న వైద్యుడిని దూషించి, గ్లాస్ డోర్‌ను పగుల గొట్టాడని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అంధుల గురుకుల పాఠశాలలో

విద్యార్థి మృతి

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని తండ్రి ఫిర్యాదు


శ్రీవత్సవ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 9: కొత్తపల్లి మండలం రేకుర్తి పరిధిలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం దామ శ్రీవత్సవ్(13) అనే విద్యార్థి టవల్ మెడకు చుట్టుకుని మృతి చెందాడు. పాఠశాల ప్రిన్సిపాల్ మంగళవారం మధ్యాహ్నం విద్యార్థి తండ్రికి ఫోన్ చేసి మీ కొడుకు శ్రీవత్సవ్ వాంతులు చేసుకుంటున్నాడు, జ్వరం వచ్చినట్లుంది తొందరగా రావాలని చెప్పినట్లు శ్రీవాత్సవ్ తండ్రి దామ సది తెలిపారు. మళ్లీ ప్రిన్సిపాల్ ఫోన్ చేసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు చెప్పాడని, తాము వెళ్లి చూసే సరికి శ్రీవత్సవ్ మరణించి ఉన్నాడని చెప్పారు. పాఠశాలలోని సీసీ కెమెరా పుటేజీలను తాము కూడా పరిశీలించామని, శ్రీవత్సవ్ మధ్యాహ్నం దండానికి ఉన్న టవల్‌ను మెడకు చుట్టుకుని ఆడుతూ ఒక్కసారిగా ఆగిపోయినట్లు ఉందన్నాడు. శ్రీవత్సవ్ మృతికి పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని దామ సది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడ్ మండలం ముప్పిరి తోటకు చెందిన దామ శ్రీవత్సవ్‌కు పుట్టుకతోనే ఒక కన్ను కనిపించదు. దీంతో తల్లి దండ్రులు అతడిని ఆరేళ్ల క్రితం రేకుర్తిలోని అంధుల పాఠశాలలో చేర్పించాడు. ప్రస్తుతం శ్రీవత్సవ్ ఏడో తరగతి చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మెట్‌పల్లి రూరల్, జూలై, 9 : మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన నరేందర్(45)అతిగా మద్యం తాగి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం మృతి చెందాడు. మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం..మేడిపల్లి గ్రామానికి చెందిన నరేందర్ పాత సామాన్లు వస్తువులు ఏరుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం సేవించేవాడు. మద్యానికి బానిసై నరేందర్ అతిగా తాగి మత్తులోనే పాత సామాన్ల కోసం మెట్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో పడిపోయాడు. ఎంతకు అతనిలో ఎలాంటి కదలిక లేకపోవడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి గమనించి అతడు మృతి చెందినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 9: కరీంనగర్ సాయినగర్‌లోని సాయి బాబా గుడి వద్ద భిక్షాటన చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తి (50) మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మూర్ఛ వ్యాధితో మరణించాడని ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్‌పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ కె.రవిందర్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామని తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు కరీంనగర్ రెండో ఠాణా సీఐ 8712670762, హెడ్ కాని స్టేబుల్ రవీందర్ 9491481433 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు

శుభ్రంగా లేకపోవడంతో రూ.35వేల జరిమానా


రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

కోల్‌సిటీ, జూలై 9: పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం నగరపాలక సంస్థ హెల్త్‌అసిస్టెంట్లు మంగళవారం గోదావరిఖని కవిత థియేటర్ సమీపంలోని సాఫ్రాన్ మండి హౌస్‌లో తనిఖీలు జరిపారు. సరైన పరిశుభ్రత పాటించకుండా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను గుర్తించినట్లు కిరణ్, వైకుంఠం పేర్కొన్నారు. రెస్టారెంట్ యజమానులకు రూ.30వేల జరిమానా విధించా మన్నారు. ఈ ఆహార పదార్థాలను తిరిగి వినియోగించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం

● మార్పులు, చేర్పులు ప్రారంభం
● తమకు సంబంధం లేదంటున్న ఆర్‌అండ్‌బీ అధికారులు
● ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సొంత నిధులతో పనులు

హుజూరాబాద్, జూలై 9: హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం ఉందని మంగళవారం మరమ్మతులు ప్రారంభించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన సొంత ఖర్చులతోనే మరమ్మతులు చేయిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్యాంపు కార్యాలయానికి వాస్తు బాగా లేకపోవడం వలనే అపశృతు లు చోటు చేసుకుంటున్నాయనే ఉద్దేశ్యంతో పోర్టికో, కిటికీలు, తలుపు లు తొలగిస్తున్నారని ప్రచారం సాగుతోంది. గతంలో హుజూరాబాద్ నుంచి ఏడుసార్లు గెలిచి, తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక రాష్ట్రం వచ్చిన ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఈటల రాజేందర్ ఈ క్యాంపు కార్యాలయానికి వెళ్లిన తర్వాతనే ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భవనం పనులు 2019లో ప్రారంభించి 2020లో పూర్తి చేశారు. ఈ కార్యాలయంలోకి వెళ్లిన తర్వాత ఈటల రాజేందర్ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయ్యారు. అనంతర పరిణామాలతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తరువాత జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేసి గెలిచినా ప్రతిపక్షంలో ఉండడంతో ఆయనకు నియోజకవర్గంలో ఎలాంటి ప్రాధాన్యం లభించలేదు. ఆ సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరించేవాడు. ఆ సమయంలో ఈటల రాజేందర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఉపయోగించేవారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఈటల రాజేందర్ ఓడిపోయారు. ఈటలకు కంచుకోటగా ఉన్న హుజూరాబాద్‌లో ఆయన ఓడిపోవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఇదంతా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం ఉండడం వల్లే జరిగిందని ప్రచారం జరిగింది. దీంతో ఎన్నికల్లో గెలిచి ఆరు నెలలైనా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వాస్తు పండితులను తీసుకొచ్చి చూపించడంతో వారు పలు సూచనలు చేశారు. దానికి తగ్గట్లు పనులు ప్రారంభించారు.. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈని వివరణ కోరగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న పనులకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.


హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొనసాగుతున్న పనులు

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,275 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 12.208 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.258 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

నల్లగొండ ఆలయంలో దొంగతనం

కొడిమ్యాల, జూలై 9: మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగింది. ఆలయ సిబ్బంది గర్భ గుడి తాళాలు పగిలి ఉండటం గమనించి మంగళవారం ఉదయం ఎస్సై సందీప్‌కు సమాచారం అందించడంతో సిబ్బందితో అక్కడకు చేరుకున్న ఎస్సై డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు గుడి తాళాలు పగులగొట్టి నర్సింహస్వామి విగ్రహంపై ఉన్న విలువైన 5.3 తులాల బంగారు ఆభరణాలు పుస్తెలు, కాసులహారం ఎత్తుకుపోయినట్లు గుర్తించారు. ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆలయంలోని ఉత్సవ మూర్తులపై ఉన్న వెండి ఆభరణాలను వదిలి పోయినట్లు సిబ్బంది తెలిపారు. కొడిమ్యాల ఎస్సై ఆద్వర్యంలో పోలీసులు ఆలయ సిబ్బందిని, పలువురు భక్తులను విచారించారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

సుల్తానాబాద్, జూలై 9: సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజ్‌పల్లి గ్రామంలో అక్రమంగా నిలువ చేసి ఉంచిన 22 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ సుల్తానాబాద్ మండలంలో పలు గ్రామాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐతరాజ్‌పల్లి గ్రామంలో యార్ల మల్లయ్య ఇంటి వద్ద ఆటోలో తరలించడానికి సిద్దంగా ఉన్న 22 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని ప్రేమ్‌కుమార్ వివరించారు. ఇట్టి బియ్యాన్ని పెద్దపల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని అన్నారు. యార్ల మల్లయ్యపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం పాపయ్యపల్లె గ్రామంలో పీడీఎస్ బియ్యం పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు చేశామన్నారు. ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, బద్దెనపల్లికి చెందిన మోతె విజయ్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విజయ్‌ను విచారించగా గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని సేకరించి సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన నరేష్‌కు విక్రయిస్తున్నట్లు తెలిపాడన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

● జగిత్యాల టౌన్: రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం టౌన్ ఎస్సై మన్మధరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతం నుంచి షేక్ అంజద్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

ఘనంగా జగన్నాథ రథోత్సవం


కోరుట్లలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల, జూలై 9: హరే రామ... హరే కృష్ణ నామస్మరణతో కోరుట్ల పట్టణం మారుమోగింది. మంగళవారం పెద్దపూర్ ఇస్కాన్ దేవాలయ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో జగన్నాథ రథోత్సవం ఘనంగా సాగింది. పట్టణంలోని వేంకటేశ్వర, నగేశ్వర దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఇస్కాన్ దేవాలయ నిర్వాహకులు భక్తులు రథోత్సవం ప్రారంభించారు. రథోత్సవం వేంకటేశ్వర దేవాలయం నుంచి ఐబీ రోడ్డు నంది, కార్గిల్, అంబేడ్కర్ చౌరస్తాల మీది జాతీయ రహదారిపై కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు హరే రామ హరే కృష్ణ నామస్మరణతో భజనలతో నృత్యాలు చేస్తూ రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రహదారులను నీటితో శుభ్రం చేయగా ఇస్కాన్ భక్తులు రోడ్లపై రంగవళ్లలు వేస్తూ స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ కుమార్ రథోత్సవంలో పాల్గొన్న భక్తులతో కలిసి నృత్యాలను చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ దేవాలయ నిర్వాహకులు పాల్గొన్నారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కోరుట్ల సిఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

శంకరపట్నం, జూలై 9: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన కాశక రఘువరణ్ (44) అనే వ్యక్తి ఈ నెల 7న అతని బావమరిది పొరముళ్ల శ్రీనివాస్‌తో కలిసి బైక్‌పైన శంకరపట్నం మండలం లింగాపూర్‌లోని బంధువుల ఫంక్షన్‌కు వెళ్తున్నారు. అత్యవసర పనుల నిమిత్తం మెట్‌పల్లి గ్రామానికి వెళ్తుండగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి రైస్‌మిల్ వద్దకు చేరుకోగానే టిప్పర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి బైక్‌ను ఢీ కొట్టాడు. బైక్ పైనుంచి ఇద్దరు కింద పడగా, కాశక రఘువరణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి టౌన్, జూలై 9: టీజీఎస్‌ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ పరిధిలో గల జిల్లా కేంద్రాల్లో, పట్టణ, మండల కేంద్రాల్లో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ ఏజెంట్ల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కరీంనగర్ లాజిస్టిక్స్ ఏటీఎం ఎన్ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రాలలో ఏజెంట్ కొరకు 5,000 రూపాయలు, మండల కేంద్రాల్లో 1000 రూపాయలు డీడీల రూపంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వాళ్లు కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి, హుజురాబాద్ సంబంధిత మండలాల వాళ్లు సేల్స్ టీం లీడర్ రాజు 9154298581ను, జగిత్యాల జిల్లాలోని మండలాల వారు రమేష్ 9154298572ను, సిరిసిల్ల జిల్లాలోని వాళ్లు శేఖర్ రావు 9154298576ను, హుస్నాబాద్ పరిధిలోని మండలాల వాళ్లు సురేష్ 9154298673ను సంప్రదించగలరని ఏటీఎం తెలిపారు. దీనికి గడువు తేదీ లేదని, ఆసక్తిగల వాళ్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువతి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 9: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన రంగం పూజిత (19) అనే యువతి మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు పూజిత ఇంటర్‌మీడియట్ పూర్తి చేసింది. డిగ్రీ మొదటి సంవత్సరం కరీంనగర్‌లోని ఓ కళాశాలలో చేరింది. అక్కడ తనతో చదివిన స్నేహితులు ఎవరూ లేరని కుటుంబీకులకు చెప్పి బాధపడింది. మంగళవారం తల్లి కూరగాయలు అమ్మడానికి ధర్మారం వెళ్లింది. తమ్ముడు చదువుకోవడానికి పాఠశాలకు వెళ్లాడు. ఎవరూ లేని సమయంలో ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. తండ్రి జీవనోపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జూలై 9: మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందిన గొట్టిపడుత శంకర్‌గౌడ్(67)అనే వృద్ధుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌గౌడ్ ఈ నెల 2న ఆరపేట ఎక్స్ రోడ్డు సమీపంలో ప్రమాదవశాత్తు దిచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న శంకర్‌గౌడ్ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు అన్న గొట్టిపడుత గంగారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 9: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లపల్లికి చెందిన కిష్టస్వామిగౌడ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కిష్టస్వామిగౌడ్ తన స్కూటీపై గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో యూటర్న్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో మండలంలోని బుగ్గరాజేశ్వరతండాకు చెందిన యువకుడు రాజేందర్ బైక్‌తో అతివేగంగా ఢీకొట్టాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెప్టిక్ ట్యాంకులో పడిన బాలుడు

● పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన ● బాలుడి పరిస్థితి విషమం


బాలుడిని అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలిస్తున్న సిబ్బంది


పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మూత తీసి ఉన్న సెప్టిక్ ట్యాంక్

పెద్దపల్లి టౌన్, జూలై 9: పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ బాలుడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆసుపత్రి ఆవరణలోని సెప్టిట్ ట్యాంక్ మూత తెరిచి ఉంచడంతో మంగళవారం ఉదయం తొమ్మిదేళ్ల బాలుడు అందులో పడిపోయాడు. అతడి పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్, రాములమ్మ దంపతులు కూలీ పనుల కోసం పెద్దపల్లికి వచ్చారు. సోమవారం శ్రీనివాస్‌కు జ్వరం రావడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారితో పాటు వారి తొమ్మిదేళ్ల కుమారుడు విలియమ్స్ ఆసుపత్రిలోనే ఉన్నాడు. మంగళవారం ఉదయం టాయిలెట్ కోసం ఆసుపత్రి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్ గల ప్రదేశానికి వెళ్లాడు. ట్యాంక్ మూత తెరిచి ఉండడంతో విలియమ్స్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లి కేకలు వేయడంతో ఆసుపత్రి సిబ్బంది అక్కడకు చేరుకొని బాలుడిని బయటకు తీశారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ రమాకాంత్‌ను వివరణ కోరగా, సెప్టిక్ ట్యాంకుపై మూత తెరిచి ఉన్న కారణంగానే బాలుడు అందులో పడ్డాడని తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని వివరించారు.

ప్రమాదకరంగా బాలుడి పరిస్థితి

సుభాష్‌నగర్: పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలోని సెప్టింక్ ట్యాంకులో పడిన బాలుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ట్యాంకులో పడిన బాలుడిని సకాలంలో గుర్తించక పోవడం, నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల ప్రస్తుతం కోమా స్థితిలో ఉన్నాడని, 48 గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేమని డాక్టర్లు తెలిపారు.

భారతదేశానికి రక్షణ కవచం ప్రధాని మోదీ

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సజయ్ కుమార్


మున్నూరుకాపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్

వేములవాడ టౌన్, జూలై 9 : దేశంలో గోకుల్ బాంబు బ్లాస్టులు లేవని, లుబిని పార్క్‌లాంటి బ్లాస్టులు, టెర్రరిస్టుల అలజడి దేశంలో ఎక్కడ కనబడుతలేవంటే కేవలం ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి రక్షణ కవచంలా నిలుస్తున్నాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సజయ్ కుమార్ అన్నారు. వేములవాడ పట్టణంలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేసి తీరుతానని హామీచ్చారు. ఆయా ఆలయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌ను కలిశామన్నారు. అవసరమైతే కేంద్ర మంత్రిని వేములవాడకు తీసుకు వచ్చేందుకు కృషి చేసి అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మీరంతా కష్టపడి పని చేసినందుకే మంత్రిని అయ్యాయనని, నా గెలుపునకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా సహకరించారని అన్నారు. నాకు భారీ మెజార్టీ అందించిన ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తానని, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తానని అన్నారు. అనంతరం పట్టణం బీజేపి పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా భీమేశ్వర గార్డెన్‌కు వీచ్చేసిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మీరు తయారు చేసిన కార్యకర్తను అని, కింది స్థాయి నుంచి ఎదిగిన వ్యక్తిని అని, కష్టమొచ్చిన కార్యకర్తలకు అండగా ఉంటానని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. దేశంలో మోదీ ప్రభుత్వం లేకుంటే 370 ఆర్టికల్ రద్దు చేసే సాహసం ఎవరూ చేసేవాళ్లు కాదన్నారు. మొన్నటి వరకు పార్లమెంట్ చేసే చట్టాలు జమ్మూ కాశ్మీర్‌కు వర్తించేవి కాదని, 370 ఆర్టికల్ రద్దుతో భారతీయ జెండా సగర్వంగా ఎగురుతుందని ఉద్వేగభరితంగా చెప్పారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, దళితమోర్చ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, మాజీ ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, నాయకులు రేగుల మల్లికార్జున్, జక్కుల తిరుపతి తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ఘనంగా ఆషాఢమాస పూజలు


మానసాదేవి ఆలయంలో కుంకుమ పూజలు


మెట్‌పల్లి పెద్దమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

గన్నేరువరం, జులై 9: మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయానికి ఆషాఢమాస శోభ సంతరించుకుంది. స్వయంభువుగా వెలసిన మానసాదేవి ఆలయంలో ఆషాఢమాసం మొదటి మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చాలని ముడుపులు కట్టి, ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ ఛైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు అమర్‌నాథ్ శర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● మెట్‌పల్లి: పట్టణంలోని బంగారు పెద్దమ్మ తల్లి ఆలయంలో కల్యాణ కాత్యాయనీ దేవి వ్రతాన్ని ఘనంగా జరిపించారు. మంగళవారం ఆలయంలో బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలను ఆలయ పురోహితుడు మదన్‌శర్మ జరిపారు. అనంతరం భక్తులు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని గోమాతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపి వాటికి ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు పురోహితులు తీర్థ ప్రసాదం అందజేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి

గన్నేరువరం, జులై 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మండల ప్రజాసంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు భిక్షపతికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల కన్వీనర్, గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సంపత్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. హామీలలో భాగంగా మహాలక్ష్మి పథకంలో 18 సంవత్సరాల నుంచి ప్రతి మహిళకు నెలకు 2,500 ఇవ్వాలని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతకు రైతుభరోసా సాయం 7,500 అందించాలని, వ్యవసాయ కూలీలకు 12000, కౌలు రైతులకు 15000, ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ అందించాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం లేనివారికి 200 గజాల స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం 5లక్షలను, కేంద్ర ప్రభుత్వం పది లక్షలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జీల ఎల్లయ్య, మండల నాయకులు పాశం వేణు, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించడం లేదని పంచాయతీ కార్యాలయానికి తాళం


తాళం వేసి ఉన్న రాంసాగర్ పంచాయతీ భవనం

కొడిమ్యాల, జూలై 9 : ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన బిల్లులు చెల్లించడం లేదని జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని రాంసాగర్ గ్రామ పంచాయతీ భవనానికి కాంట్రాక్టర్ నీలగిరి గంగారావు మంగళవారం తాళం వేశాడు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ మాట్లాడుతూ గ్రామంలో రూ. 20లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించినట్లు తెలిపాడు. 2024 ఫిబ్రవరిలో భవన నిర్మాణం పూర్తి చేసి అప్పగించానన్నారు. ఇప్పటి వరకు తనకు రావాల్సిన డబ్బులు అందలేదన్నాడు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం నుంచి వచ్చిన తర్వాత చెల్లిస్తాం అంటున్నారే తప్ప బిల్లులు మాత్రం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కారణంగా కార్యాలయానికి మంగళవారం తాళం వేశానని కాంట్రాక్టర్ గంగారావు తెలిపాడు. ఈ విషయమై ఎంపీవో వాసవిని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతోనే చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లులు త్వరలో చెల్లించేలా చూస్తామని కాంట్రాక్టర్‌కు హామీ ఇవ్వడంతో బుధవారం తాళం తీస్తానని చెప్పారని తెలిపారు.

దొంగ అరెస్ట్

పెద్దపల్లి టౌన్, జూలై 9 : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మే 28న హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెల మండలం, ఘైలారం గ్రామానికి చెందిన కంపెల శ్రీనివాస్ గతంలో నెన్నల్, రెబ్బనలోని ఆలయాల్లో దొంగతనం చేయగా కేసులు నమోదు కావడంతో ఏడాది కాలం జైలుకు వెళ్లాడు. గత ఐదేళ్లుగా పెద్దపల్లి పట్టణంలోని తిలక్‌నగర్‌లో ఉంటూ సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడని అన్నారు. జల్సాలకోసం తిరిగి అయ్యప్ప ఆలయంలో దొంగతనం చేశాడని , అతన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పెద్దపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా దొంగను గుర్తించి అతని వద్ద రూ.4370లను రికవరీ చేసినట్లు తెలిపారు. దొంగను పట్టుకోవడంతో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు, మల్లేశంతో పాటు సిబ్బందిని అభినందించారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

● లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం



నిరుపయోగంగా ఉన్న రంగపేట క్రీడాప్రాంగణం

మానకొండూర్, జూలై 9: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించి నైపుణ్యం గల క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్ధేశ్యం లక్షల రూపాయలను వెచ్చించి తెలంగాణ క్రీడా ప్రాంగణాలను నెలకొల్పాడు. గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. మండలంలో 27 గ్రామపంచాయితీలుండగా నిజాయితీగూడెంలో స్థలం లేక అక్కడ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయలేదు. మిగతా 26 గ్రామాలలో ఒక్కొక్క దానికి రూ. 2లక్షల ఎస్టిమేషన్ ఉన్నప్పటికీ లక్ష రూపాయల వరకే చెల్లింపులు జరిగాయి. ఈ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టు, ఆర్చీల నిర్మాణం ఎంతో ఆర్భాటంగా పూర్తి చేశారు. రంగపేట క్రీడా ప్రాంగణం గ్రామానికి సుమారు 4కిలోమీటర్ల దూరంలో యువకులకు ఉపయోగపడకుండా ఉంది. ప్రతి గ్రామానికి 16 రకాల ఆట వస్తువుల కిట్లును అధికారులు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన కిట్లు మూలన పడడంతో యువత క్రీడా ప్రాంగణాలను దూరం అయ్యారు. దీంతో క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

కూలిన వృక్షానికి జీవం



ఓబులాపూర్‌లో నాటిన చెట్టు

తంగళ్లపల్లి, జూలై 9: గాలివానకు కూలిన వృక్షానికి జీవం పోశారు. తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ శివారులోని సమ్మక్క, సారలమ్మ గద్దెల సమీపంలో ఉన్న 80 ఏళ్ల మర్రిచెట్టు గాలివానకు నేలకూలింది. సమ్మక్క, సారలమ్మ వద్దకు వచ్చే భక్తులతోపాటు గ్రామస్థులకు నీడనిచ్చిన చెట్టు నేలకొరగడంతో గ్రామస్థులు ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. చెట్టుకు తిరిగి జీవం పోయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం వ్యయ, ప్రయాసలకు ఓర్చి చెట్టు కొమ్మలను నరికి వేసి మొదలును నాటారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలతో చెట్టు తిరిగి యథాస్థితికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని స్థానికుడు అలువాల లక్ష్మణ్ తెలిపాడు. తిరిగి చెట్టు యథాస్థితికి వచ్చి నీడను ఇవ్వాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీల సమాఖ్య చైర్మన్‌కు సన్మానం

తంగళ్లపల్లి, జూలై 9: తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కో- ఆపరేటివ్ సొసైటీల సమాఖ్య చైర్మన్‌గా నియామకమైన మెట్టు సాయికుమార్‌ను జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్ సన్మానించారు. మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు సంబంధించిన సమస్యలను వివరించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఫిషరీస్ చైర్మన్ బండి మల్లేశం తదితరులు ఉన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ముస్తాబాద్, జూలై 9 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో దోస్తీ మీట్ జిల్లా స్థాయి వాలీబాల్ కబడ్డీ పోటీల్లో భాగంగా మండల క్రీడాకారులకు వాలీబాల్ కిట్లను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్సై శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 12వ తేదీన నిర్వహించ తలపెట్టిన క్రీడల్లో పాల్గొని మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పీసీ రాజశేఖర్, కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, రాజిరెడ్డి, ఉచ్చిడి బాల్‌రెడ్డి, కోల కృష్ణ, మిరుదొడ్డి భాను, రజాని నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వేదికను విజయవంతం చేయాలి

ఇల్లంతకుంట, జూలై 9: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను విజయవంతం చేయాలని సెస్ ఏఈ రాకేష్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. తంగళ్లపల్లి రైతువేదికలో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల విద్యుత్ వినియోగదారులు చేసుకోవాలని పేర్కొన్నారు.

రైతు భరోసాపై స్పష్టత కరువు

ఇల్లంతకుంట, జూలై 9: రైతుభరోసాపై స్పష్టత కరువైందని, వానాకాలం సీజన్ ప్రారంభమైనా ఇంతవరకు ప్రకటించలేదని బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బుర్ర సూర్యగౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతులు పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వం సీజన్ ప్రారంభంలోనే రైతులకు అండగా నిలిచేదన్నారు. రైతుభరోసా ఎప్పుడు ఇస్తారో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఉపసర్పంచ్ గొజ గాని కిషన్, నాయకులు కెశవేని శ్రీనివాస్, దమ్మని మధు పాల్గొన్నారు..

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 9: పలు గ్రామాల్లో ప్రత్యేక నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయించేలా కార్యకర్తలు చూడాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కార మార్గం చూపాలన్నారు. మొదటి విడతలో ప్రారంభించిన పనులను వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సూచనల మేరకు ఈ నెలాఖరులో రెండో విడత మంజూరయ్యే నిధులను ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీర్చే పనులను చేపట్టేలా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, రాములు, బుచ్చాగౌడ్, దేవయ్య, రాజేందర్, రాజునాయక్, రాంరెడ్డి, మహేందర్, బాల్‌రెడ్డి, రఫీక్, రవి, శ్రీనివాస్‌గౌడ్, సతీష్, కిష్టారెడ్డి, తిరుపతిరెడ్డి, కిషన్, బాలయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

గంభీరావుపేట, జూలై 9 : గంభీరావుపేట ఛత్రపతి శివాజీ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా జిల్లల్ల పర్శరాములు, ఉపాధ్యక్షులుగా చెల్లపురం దేవయ్య, నాయకపు నర్సింలు, పెద్ద బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా పల్లె శ్రీనివాస్, కోశాధికారిగా వేశాల రాజు, సంయుక్త కార్యదర్శులుగా పంతులవారి శంకర్, పొన్నాల సంతోష్, ఆరుసల ప్రశాంత్, కొట్టె బాలరాజు, నరాని రాజును ఎన్నుకున్నారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

ముస్తాబాద్, జూలై 9 : పోక్సో కేసు నమోదుపై డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం బంజర్‌పల్లికి చెందిన రోమాల రాఘవేంద్ర అనే యువకుడు బాలికను ఇబ్బందులు పెట్టిన నేపథ్యంలో పోక్సో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ముస్తాబాద్, బంజర్‌పల్లి, బందనకల్, దుబ్బాక తదితర గ్రామాల్లో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి విచారణ చేసి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎస్సై శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలి

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని కోరుతూ జగిత్యాలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మంగళవారం పలువురు పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు పోస్టు ద్వారా ఉత్తరాలు పంపారు. ఈనెల 23వ తేదీన కేంద్ర బడ్జెట్ లోక్ సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ. 15 లక్షలకు పెంచాలని కోరుతూ పోస్టు కార్డులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పంపారు. పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్, నాయకులు బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంత్ రెడ్డి, రాజేశ్వర్, శివానందం, గంగాదర్, గంగారాం, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా భవానీ వేడుకలు

- ప్రత్యేక పూజలు - సంప్రదాయ నృత్యాలు



తండాలో నైవేద్యంతో మహిళలు

ఎల్లారెడ్డిపేట, జూలై 9: ప్రకృతి ఒడిలో గిరిజనులు పులకించిపోయారు. భక్తిశ్రద్ధలతో దేవీని వేడుకున్నారు. యువతులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలు చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం గుండారం, బాకురుపల్లి తండా, బుగ్గరాజేశ్వరతండా, తిమ్మాపూర్, రాజన్నపేట, కిష్టునాయక్ తండా, అక్కపల్లి, అల్మాస్‌పూర్, దేవునిగుట్టతండా, గుంటపల్లిచెరువుతండా తదితర గిరిజన తండాల్లో మంగళవారం శీత్లా భవానీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు అధిక సంఖ్యలో నైవేద్యాలతో గ్రామ శివారులోకి తరలి వెళ్లారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలు, పాడి పంటలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు. నైవేద్యాలు సమర్పించి దేవిని కొలిచారు. అనంతరం మూగజీవాలను బలిచ్చారు. ఆవుల మందతో దాటించారు. మహిళలు, యువతులు ఆటాపాటలతో నృత్యాలు చేశారు. సామూహిక వన భోజనాలు చేశారు. తండాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో తండా పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం జగదాంబతండాలో సీత్లా భవానీ పండగను ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడి పంటలు పండాలని ఏటా ఆషాఢ మాసంలో సీత్లా భవానీ పండుగ నిర్వహించారు. అందులో బాగంగానే జగదాంబతండాలో సీత్లా పండగ నేపథ్యంలో పూజలు చేశారు. సంప్రదాయ నృత్యాలు పాటలతో ఆనందోత్సవాల మధ్య గడిపారు.

వీర్నపల్లి: వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలు, పశువులు ఆరోగ్యంగా ఉండాలని సీత్లా భవానీ పండగ నిర్వహిస్తున్నామని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్ నాయక్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని బావ్‌సింగ్ నాయక్ తండా, భూక్యతండా, ఎర్రగడ్డ తండా, లాల్ సింగ్ తండా, మద్దిమల్ల తండాలతోపాటు పలు తండాల్లో గిరిజనులు సీత్లా భవాని వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తాజా మాజీ జడ్పీటీసీ గుగులోతు కళావతి, మాజీ ఎంపీపీ మాలోతు భూల, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు గుగులోతు కళ, బంజారా సంఘం నాయకులు శ్రీరామ్ నాయక్, తిరుపతి నాయక్, సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

కోనరావుపేట: గిరిజనుల ఆరాధ్య దైవమైన శీత్లా భవాని వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. శీత్లా విగ్రహాలను తండా పొలిమేరలో ప్రతిష్ఠించి మహిళలు బోనాలతో డప్పుచప్పుల మధ్య వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. పండుగను కోనరావుపేట మండలంలోని పలు తండాల్లో గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు.

రుద్రంగి: శీత్లా భవాని పండుగను రుద్రంగి మండలం చుట్టు ఉన్న గిరిజన తండాలల్లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆడ్డబోరు తండా, రూప్లానాయక్ తండా, దెగవత్ తండా, బడి తండా సర్పంచ్ తండాతో పాటు వివిద తండాలల్లో గ్రామ శివారుల్లో చేట్టు కింద దేవతల విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. మహిళలు, యువతులు నైవేద్యాన్ని సమర్పించారు.



జగదాంబతండాలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు



కమ్మరిపేట తండాలో బోనాలతో వెళ్తున్న యువతులు



మొక్కులు చెల్లిస్తున్న గిరిజనులు

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



జీపీని సందర్శించిన అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగానే 'మహిళా శక్తి' పథకంలో భాగంగా 'మీ సేవ' కేంద్రాల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తుండడంతో మహిళలు మరింతా రాణిస్తారని అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్, అల్మాస్‌పూర్ గ్రామాల్లోని మహిళ సంఘాలకు మంజూరైన మీ సేవ కేంద్రాల ఏర్పాటుపై స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రుణాలను అందించడంతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తోందన్నారు. మహిళ శక్తి పథకంలో భాగంగా జిల్లాలోని మహిళా గ్రామైక్య సంఘాలకు మీ సేవ కేంద్రాలను కేటాయించిందన్నారు. కేంద్రాల నిర్వహణ, సేవలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. డీపీఎం సుధారాణి, ఏపీఎం మల్లేశం, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, రమేశ్, సీసీలు దేవేందర్, పద్మ, వీవోఏలు తదితరులు ఉన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 9: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆగిపోయిన ఏరియల్స్ వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో నంబరు 11తో గత ఆరు నెలలుగా ఆగిపోయిన మున్సిపల్ కార్మికుల ఏరియల్స్‌ను చెల్లించా లన్నారు. మున్సిపల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26వేలు చెల్లించాలని అన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులు, కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ చెల్లించాలని కోరారు.

పర్యావరణంపై అవగాహన పెంపొందించుకోవాలి



విద్యార్థులతో ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, జూలై 9: విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంపొందించుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య కోరారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా తెలంగాణ నేషనల్ గ్రీన్‌కాప్స్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో యాజమాన్యాలు ఎనిమిది, తొమ్మిది తరగతి విద్యార్థు లకు జిల్లా స్థాయిలో కవితలు, పోస్టర్ల తయారీ పోటీలతోపాటు పర్యావరణంపై అవగాహన కల్పించాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలతోపాటు ప్రైవేటు పాఠశాలల నుంచి 140 మంది విద్యార్థులతోపాటు 35 మంది పాఠశాలల ఎన్జీసీ ఇన్‌చార్జి టీచర్లు హాజరయ్యారు. కవిత విభాగంలో ప్రథమ హర్షిత (జిల్లా పరిషత్ శివనగర్, సిరిసిల్ల), ద్వితీయ అక్షయ(నర్సింగా పూర్ జిల్లా పరిషత్), తృతీయ ప్రణవి (నారాయణ పూర్ జిల్లా పరిషత్), పోస్టర్ తయారీలో ప్రథమ (హన్మాజిపేట జిల్లా పరిషత్), ద్వితీయ లక్ష్మీ ప్రసన్న (అవు నూరు జిల్లా పరిషత్), తృతీయ రవిత్‌రాణి(కేజీబీ బీ వేములవాడ) గెలుపొందగా బహుమ తులు అందజేశారు. ఎంఈవో రఘుపతి, న్యాయ నిర్ణేత లుగా బాల్‌రెడ్డి, శంకర్, సానబాబు వ్యహరించారు.

బండి సంజయ్‌ని కలిసిన నాయకులు



బండి సంజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

కోనరావుపేట, జూలై 9 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ మండల నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటిసారిగా వేములవాడకు వచ్చిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత చెన్నమనేని వికాస్ రావు, జిల్లా నాయకులు గోపాడి సురేందర్ రావు, పల్లం అన్నపూర్ణ, మండల నాయకులు గొట్టె రామచంద్రం, ఆంబోజ లక్ష్మీనారాయణ, వెలిశాల రవి, బెంద్రె శ్రీనివాస్ రెడ్డి, అనుపాటి బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హై ఓల్టేజీతో సామగ్రి దగ్ధం

వేములవాడ టౌన్, జూలై 9 : వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌లో హై ఓల్టేజీతో ఎలక్ట్రానిక్ సామగ్రి పని చేయకుండా పోయాయని కాలనీవాసులు తెలిపారు. మంగళవారం ఉదయం ఒక్కసారిగా విద్యుత్ హై వోల్టేజీ రావడంతో ఒక్కసారిగా ఫ్యాన్లు, లైట్లు, వాటర్ గీజర్స్ ప్యూరీఫైడ్ వాటర్ ఫిల్టర్లు, ఫ్రిజ్‌లు కాలిపోయినట్లు తెలిపారు.

అనారోగ్యంతో చిన్నారి మృతి

తంగళ్లపల్లి, జూలై 9: తంగళ్లపల్లి గోపాల్‌రావుపల్లె గ్రామానికి చెందిన అలూరి ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీ దంపతుల కూతురు అలూరి చైత్రిక (5) అనారోగ్యంతో మృతిచెందింది. దంపతులకు ఇద్దరు కూతుళ్లు అవంతిక, చైత్రిక ఉన్నారు. నెల రోజులుగా చిన్న కూతురు చైత్రిక తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతుండగా చికిత్స చేయిస్తున్నారు. చికిత్స పొందుతున్న చైత్రిక మంగళవారం మృతిచెందింది.

ఏజెన్సీలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, జూలై 9: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేయాలని, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవ నంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఎంపిక, వారికి వేతనాలు చెల్లించే బాధ్యతలను రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం ఏజెన్సీలకు అప్పగించిందని, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఏజెన్సీలను రద్దు చేయాలని అన్నారు. ఎంపికైన ఉద్యోగుల నుంచి ఏజెన్సీ నిర్వాహకులు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, ఎంపికైనవారిపై పని భారం మోపుతోందని అన్నారు. ఏజెన్సీల వేధింపులు భరించలేక కొందరు ఆత్మహత్యకు యత్నిస్తున్నారన్నారు. ఏజెన్సీలపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని అన్నారు. సమస్యల వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్పందించని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, కార్మిక సంఘం జిల్లా నాయకుడు సోమ నాగరాజు, విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు అంగూర్ రంజిత్ పాల్గొన్నారు.

సిద్దప్ప వరకవి ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ముస్తాబాద్, జూలై 9 : తెలంగాణ తొలి సమాజ కవి సిద్దప్ప ఆశయ సాధనకు కృషి చేయాలని ముస్తాబాద్ మండల కుమ్మరి సంఘం అధ్యక్షుడు సిలివేరి స్వామి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి కూడలిలో సిద్దప్ప వరకవి 121వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. 1903వ సంవత్సరంలో సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డిపల్లెలో జన్మించి కుల అభివృద్ధికి, సామాజిక అభివృద్ధికి సుదీర్ఘపోరాటం చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మరులకోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ట్యాంకుబండ్‌పై సిద్దప్ప వరకవి విగ్రహాన్ని నెలకొల్పాలన్నారు. కుమ్మరి సంఘం నాయకులు ఏదునేరి భాను, ఏదునూరి రాములు, దరిపెల్లి వెంకటేశ్, ఎదునూరి మల్లయ్య, దరిపెల్లి శంకర్, ఆవునూరి ఎల్లయ్య, ఇల్లెందుల వెంకట్, ఏదునూరి గోపి, ఏదూనూరి రాములు, కిషన్, స్వామి, లక్ష్మీపతి, అశోక్‌త పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బోయినపల్లి, జూలై 9: బోయినపల్లి మండలం మర్లపేటలో వివిధ కారణాలతో మరణించిన మృతుల కుటుంబాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సాయికృష్ణ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మండల బీజేపీ నాయకులు గూడి రవీందర్‌రెడ్డి, నర్సింహాచారి, శ్రీనివాసరెడ్డి, రాజూరి కిరణ్, ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 9 : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందని, కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చి అమలు చేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని విజయవంత చేయాలన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చి అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయడం లేదన్నారు. దీంతో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం ఆల్ ఇండియా వర్కర్స్ డిమాండ్స్ డే నిరసన చేపట్టనున్నట్లు చెప్పారు. అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం 11గంటలకు ర్యాలీని ప్రారంభమవుతుందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్, అన్నల్‌దాస్ గణేష్, సత్యం పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న రజినీకాంత్

సిరిసిల్ల రూరల్, జూలై 9: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రజనీ కాంత్ మాట్లాడారు. ఈ నెల 12న చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా విద్యారంగాన్ని పట్టించుకుంటుందనుకుంటే చిన్న చూపు చూస్తోందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో కనీసం విద్యా శాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ ఎనిమిది వేల కోట్లపై చిలుకు రూపాయాలు పెండింగ్ ఉన్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఈ నెల 12న ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో చలో కలెక్టరేట్ చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద అనిల్‌కుమార్, మల్లారపు ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



ముస్తాబాద్‌లో వేడుకల్లో నాయకులు, విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, జూలై 9: అఖిల భారత విద్యార్థి పరిషత్ విద్యారంగ సమస్యలే కాకుండా సామాజిక రాజకీయ సమస్యలపై ఉద్యమిస్తోందని, జాతిని జాగృతం చేస్తోందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నాగరాజు అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో మంగళవారం ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జాతీయ పునర్నిర్మాణమే ధ్యేయంగా విశ్వగురు భారత్ లక్ష్యంగా జూలై 9, 1949న ఏబీవీపీ పురుడుపోసుకుందన్నారు. ప్రస్తుతం లక్షలాదిమంది విద్యార్థుల సభ్యత్వంతో దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా పేరుగాంచిందన్నారు. హరిత తెలంగాణ పేరుతో కోటి మొక్కలు నాటామని, కరోనా సమయంలో దేశవ్యాప్తంగా రక్తదానం, నిత్యావసర సరుకుల పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ కరీంనగర్ లా ఫోరం కన్వీనర్ సమానపెల్లి ప్రశాంత్, శ్రీనివాస్, మధు, ధనుష్, శ్రావణ్, గౌతమ్, వికాస్, అభి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు జాతీయ భావాలు నేర్పుతూ జాతీయ పునర్నిర్మాణం కోసం పరితపిస్తున్నది ఏబీవీపీ అన్నారు. విద్యారంగ సమస్యలపై పోరాడుతూ 43 మంది విద్యార్థులు అమరులయ్యారన్నారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. సోషల్ మీడియా రాష్ట్ర కో- కన్వీనర్ శివ, నాయకులు భాను, ప్రవీణ్, నవీన్, సాయి పాల్గొన్నారు.